నేడు ఉచిత వైద్యశిబిరం

గచ్చిబౌలి: శ్రీరామ్‌నగర్ కాలనీలోని శ్రీరామ హైస్కూల్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. శ్రీరామ్‌నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు బలరామ్ యాదవ్ ఆధ్వర్యంలో హోలిస్టిక్ ఆస్పత్రి పర్యవేక్షణలో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారు. బీపీ షుగర్, ఈసీజీ, ఐ చెకప్ వంటి పరీక్షలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.


విద్యుత్ షార్ట్ సర్క్యూట్.. గుడిసె దగ్ధం

హఫీజ్‌పేట్ : డివిజన్ పరిధిలోని మంజీరా పైప్‌లైన్ రోడ్డులో ఆర్టీసీ కాలనీ పక్కన ఖాళీ స్థలంలో ఉన్న గుడిసెలో శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు రేగాయి. దీంతో స్థానికులు గమనించి మంటలపై నీళ్ళు చల్లారు. అప్పటికే గుడిసెలో వస్తువులు, బట్టలు, సీలింగ్ ఫ్యాను కాలిపోయాయి. ఈ గుడిసెలో నేపాల్‌కు చెందిన బహదూర్ కుటుంబం నివాసముంటుంది. సెక్యూరిటీగా పని చేస్తున్నాడు. ఈ సందర్భంగా బహదూర్ మాట్లాడుతూ ఇటీవల తన జీతం రూ.18వేల నగదు డబ్బాలో పెట్టామని కాలిబూడిదైపోయాయన్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

దేవాలయ నిర్మాణానికి 5 లక్షల విరాళం

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని లింగమయ్య కాలనీలో నిర్వహించిన శ్రీ సీతారామస్వామి ఆలయ ధ్వజస్తంభ శిఖర ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. పూజలో పాల్గొన్న కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ ఆలయ నిర్మాణానికి 5 లక్షల విరాళం అందించారు. అనంతరం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో నిర్వహిస్తున్న సమ్మక్క సారక్క జాతరలో పాల్గొన్నారు. కౌన్సిలర్లు కొల్లూరి మల్లేష్ ,సదుర్ మల్లేష్, తిరుమలరెడ్డి పాల్గొన్నారు.




ఆర్ట్ ఫెస్ట్ -2024

- చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో 320 చిత్రాల ప్రదర్శన
- అపురూప చిత్రాలు అందుబాటులో..
- ఆర్ట్ విద్యార్థులకు వర్క్‌షాప్
- మార్చి 7 వరకు కొనసాగనున్న ఎగ్జిబిషన్

మాదాపూర్: దేశ వ్యాప్తంగా కళాకారులు వేసిన చిత్రాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో నిర్వహిస్తున్న న్యూస్ ది ఆర్ట్ ఫెస్ట్ -2024 ప్రదర్శనకు మంచి స్పందన లభిస్తోంది. దాదాపు 320 చిత్రాలను ప్రదర్శనలో ఉంచారు. సందర్శకులకు, విద్యార్థులకు ఏ విధంగా చిత్రాలను గీయాలి, మెళకువలు, పాత చిత్రాల విశిష్టతను క్యురేటర్‌లు డాక్టర్ లక్ష్మణ్ ఏలే, మన్వీందర్‌లు వివరిస్తున్నారు.

- ఉత్తర, తూర్పు, పశ్చిమ, దక్షిణ ప్రాంతాల నుంచి వివిధ కళాత్మక రూపాలను సేకరించారు.
- ఉదయం 11గంటల నుంచి రాత్రి 7గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుంది.
- ముందుందు మరిన్ని కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు డా.లక్ష్మణ్ ఏలె తెలిపారు.
- వివిధ యూనివర్సిటీల నుంచి విద్యార్థులు, కళాకారులు, నగరవాసులు వస్తున్నారని తెలిపారు.







ప్రదర్శనలో ఆకట్టుకుంటున్న చిత్రాలు

అద్భుతంగా ఉంది..

మొదటిసారి భారీ చిత్ర ప్రదర్శన చూస్తున్నాను. పాత చిత్రాలకు, నేటి చిత్రాలకు మధ్య తేడా తెలుస్తుంది. వర్క్‌షాపు కూడా నిర్వహిస్తుండడంతో మెళకువలు తెలుస్తున్నాయి. ఆర్ట్ విద్యార్థులు, కళాకారులే కాకుండా అందరూ చూడాల్సిన ప్రదర్శన.

–అర్జున్, మాస్టర్ ఆఫ్ ఆర్ట్ విద్యార్థి, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ

చూడాల్సిన ప్రదర్శన

విద్యార్థులు తరగతి గదులలో నేర్చుకున్నా ప్రాక్టికల్‌గా పెయింటింగ్ వేసేటప్పుడు అనుమానాలు తలెత్తుతాయి. ఎవరి స్టైల్లో వారు పెయింటింగ్ వేస్తుంటారు. అందరు కళాకారుల పెయింటింగ్‌లు ఒకే వేదికపై ఉండడం అద్భుతం. కొత్త కళాకారులు ఎన్నో మెళకువలను నేర్చుకోవచ్చు.

–ప్రగతి, ఆర్ట్స్ విద్యార్థిని

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 20, పచ్చిమిర్చి 55, బెండ 60, కాకర 60, దొండ 60, దోస 30, ఆలు 25, చామ 60, కీర 35, బీర 60, వంకాయ 40, గోకర 60, బీన్స్ 60, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 40, చిక్కుడు 60, ఉల్లి 25(కేజీ), ములక్కాయలు (3)20 , క్యాలీఫ్లవర్ (1) 40, సొరకాయ (కేజీ) 30, అల్లం 150, వెల్లుల్లి 350.

26న ఫొటోగ్రఫీపై వర్క్‌షాప్

రాయదుర్గం: మౌలానా అజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్ (ఐఎంసీ) ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన ఫొటోగ్రఫీ వర్క్‌షాప్, ఫిల్మ్ స్క్రీనింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఐఎంసీ డైరెక్టర్ రిజ్వాన్ అహ్మద్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వీసీ ఐనుల్ హసన్ అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో ఇటాలియన్ ఫిల్మ్ డైరెక్టర్, ఫొటోగ్రాఫర్ మాస్సిమిలియానో మజ్జోట్టా మాస్టర్ క్లాస్ నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా ఇటాలియన్ దర్శకుడు రెండు డాక్యుమెంటరీ చిత్రాలను ప్రదర్శిస్తారన్నారు. సమాచారం కోసం ఐఎంసీ నిర్మాత, కార్యక్రమం కన్వీనర్ ఎండీ అమీర్ (8744994437)లో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా చండీహోమం



రాయదుర్గం: మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని శనివారం గచ్చిబౌలిలోని శివ సాయిక్షేత్రంలో ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. ఆలయంలో ఉదయం లలితా మాత జన్మదినాన్ని పురస్కరించుకొ అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. గణపతి, లలితా హోమం, చండీహోమం, రుద్రహోమం, నవగ్రహ హోమం వంటి హోమాలను వేద బ్రాహ్మణుల మంత్రోచ్చారణల నడుమ నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

ఆల్విన్‌కాలనీ: పాపారాయుడునగర్‌లోని శ్రీ సంజీవ ఆంజనేయ స్వామి ఆలయ మొదటి వార్షికోత్సవం సందర్భంగా కమిటీ ఆహ్వానం మేరు పాపిరెడ్డినగర్ కంటెస్టెంట్ అధ్యక్షుడు చిట్టిరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. మొదటి వార్షికోత్సవ వేడుకల్లో సిహెచ్. నరసింగరావు, దొంతిరి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో దొంతిరి వెంకట్రావు, భాస్కర్‌రావు, మాదారం దేవేంద్రరావు, తిరుపతిరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీఆర్ ఫౌండేషన్‌లో సైన్స్ దినోత్సవం

హఫీజ్‌పేట్ : కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్‌లోని నీలం రాజశేఖర్‌రెడ్డి పరిశోధన కేంద్రంలో అన్వర్ బాషా, డాక్టర్ బీవీ విజయలక్ష్మి ఆధ్వర్యంలో 'నేడు కావాలి సైన్స్- మూఢ నమ్మకాలు' అనే అంశంపై వక్తృత్వ పోటీలను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ కె.నారాయణ, నీలం రాజశేఖర్‌రెడ్డి పరిశోధన కేంద్రం డైరెక్టర్, డాక్టర్ కె.పూర్ణచంద్రారావు, వక్తలు పాపారావు, రిటైర్డ్ కమర్షియల్ ట్యాక్స్ అధికారి భాస్కర్‌లు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు విజ్ఞానంపై దృష్టి సారించాలన్నారు. అనంతరం ఎన్‌ఆర్‌ఆర్‌సి సాంస్కృతిక విభాగం ప్రజా నాట్యమండలి సహాయంతో భాష్యం పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. న్యాయనిర్ణేతలు ఉత్తమ వక్తలను ఎంపిక చేసి మొదటి నలుగురికి బహుమతులు, మిగిలిన వారందరికి కన్సోలేషన్ బహుమతులను నారాయణ అందజేశారు. కార్యక్రమంలో కె.అజయ్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డా.నారాయణ తదితరులు

సినాప్సిస్ సంస్థ సేవలు అభినందనీయం

మియాపూర్ : సినాప్సిస్ సంస్థ సామాజిక సేవ అభినందనీయమని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో సినాప్సిస్ సాఫ్ట్‌వేర్ సంస్థ సౌజన్యంతో నూతనంగా ఏర్పాటు చేసిన సోలార్ వ్యవస్థ, 3 అదనపు తరగతుల గదులు, సైన్స్ ల్యాబ్ పరికరాలు, గ్రీన్ బోర్డులను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే గాంధీ ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వసుంధర దేవి, ఉపాధ్యాయులు బాల్‌రెడ్డి, మదన్ మోహన్, మియాపూర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చీరలు పంపిణీ

రాయదుర్గం: శ్రీకృష్ణ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు అభిషేక్‌గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకొని రాయదుర్గంలోయువతకు క్రికెట్ కిట్లు, మహిళలకు చీరలను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జీ జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడేలా యువత మంచి మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మూల వెంకటేష్‌గౌడ్, యువ నాయకుడు పట్నం రినీష్‌రెడ్డి, నాయకులు వెంకటేష్‌గౌడ్, రోహిత్‌గౌడ్, హరతీశ్ యాదవ్, జక్కులగోపాల్‌తో పాటు శ్రీకృష్ణయూత్ సభ్యులు పాల్గొన్నారు.



కార్మికులకు చీరలు పంపిణీ చేసిన జగదీశ్వర్‌గౌడ్

'యూనిక్ బర్త్ కేర్ ప్రాక్టీషనర్' సర్టిఫికెట్ కోర్సు

హెచ్‌సీయూ–ఫెర్నాండెజ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహణ

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ–ఫెర్నాండెజ్ ఫౌండేషన్‌లు కొత్తగా 'యూనిక్ కేర్ ప్రాక్టీషనర్ (బర్త్ డౌలా) సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించాలని నిర్ణయించారు. దరఖాస్తులు సమర్పించడానికి ఈనెల 29 తేదీ ఆఖరుగా నిర్ణయించారు. ఆన్‌లైన్ ద్వారా ఈ సర్టిఫికెట్ కోర్సును నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. హెచ్‌సీయూలోని సెంటర్ ఫర్ డిజిటల్ ట్రైనింగ్ అండ్ లెర్నింగ్ రిసోర్సెస్ ప్లాట్‌ఫారమ్ ద్వారా ఈ కోర్సును అందిస్తారు. ఈ కోర్సులో భాగంగా గర్భం, జననం, తక్షణ ప్రసవానంతర సమయానికి సంబంధిత కుటుంబాలను ఆదుకోవడంలో నైపుణ్యాలు, విజ్ఞానాన్ని అందించేందుకు ఈ కోర్సు తోడ్పతుంది. ప్లస్ టూ ఉత్తీర్ణత, ఆంగ్లంలో కమ్యూనికేషన్ నైపుణ్యం ఉన్న అభ్యర్థులు ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు. కోర్సు పూర్తి చేసిన వారికి ఉద్యోగాలు లభిస్తాయని నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 73373 20910లో సంప్రదించాలని కోరారు.



అలరించిన నృత్య ప్రదర్శనలు

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం కందుల కూచిపూడి నాట్యాలయం గురువు రవి శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో అలరించారు. ఇందులో మూషికవాహన, పుష్పాంజలి, వెడలెరా వయ్యారాలు, వినరో భాగ్యము తదితర అంశాలను కళాకారులు ఆద్య, కీర్తి, పూజ్య, హర్షిత, ప్రణవి, అక్షిత, మణిమాల, హేమ, శ్రీయ, తన్మయి, మధు, వైష్ణవి, కృతి, లలిత, సుప్రియ, వెళ్ళి, కనిష్క, సాహితి, సంహిత, లేఖ, తరిణి, జోషి తదితరులు ప్రదర్శించారు.

అన్నమయ్యపురంలో..

మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం లాస్యనర్తనం గురువు పుచ్చా అన్నపూర్ణ, పుచ్చా లాస్య ప్రణతి శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన ఇచ్చారు. కళాకారులు మోక్షిత, ప్రసన్న, మనోజ్ఞ, ఆద్య, ఎస్.నాయర్, విద్యశ్రీ చతుర, రియాంషి, సంయుక్తంగా మూషికవాహన, అయిగిరి నందిని, అదిగో అల్లదిగో, వినరో భాగ్యము నృత్య ప్రదర్శనలతో సందర్శకులను ఆకట్టుకున్నారు. కళాకారులను డాక్టర్ శోభారాజు ఘనంగా సత్కరించారు.



హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ విజేత సామా ఏంజెల్స్



సాక్షి, సిటీబ్యూరో: యువ గోల్ఫర్స్‌ను ప్రోత్సహించేందుకు నిర్వహిస్తున్న హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ నాలుగో సీజన్లో సామా ఏంజెల్స్ ఛాంపియన్‌గా నిలిచింది. బ్యాంకాక్ నికాంటి గోల్ఫ్ క్లబ్ వేదికగా జరిగిన ఫైనల్లో ఆ జట్టు టీమ్ ఆల్ఫాపై 60–20 స్కోర్‌తో విజయం సాధించింది. నెల రోజుల పాటు జరిగిన ఈ ఛాంపియన్ షిప్‌లో మొత్తం 16 జట్ల నుంచి 160కి పైగా గోల్ఫర్స్ పాల్గొన్నారు. సీజన్ ఆరంభం నుంచి అద్భుతంగా ఆడుతున్న సామా ఏంజెల్స్ ఫైనల్లో కూడా ఆధిపత్యం కనబరిచింది. మొత్తం 8 మ్యాచ్లలో ఆరు సామా ఏంజెల్స్ గెలిస్తే... రెండింటిలో టీమ్ ఆల్ఫా నెగ్గింది. కాగా తమ టైటిల్ విజయాన్ని మహిళా శక్తికి అంకితం చేస్తున్నానని సామా ఏంజెల్స్ కో ఓనర్ సరోజ గడ్డం చెప్పారు.

శ్రమదానం

రాయదుర్గం: దృష్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఖాజాగూడలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సంయుక్తంగా ఖాజాగూడ చెరువు పరిసరాలను శుభ్రం చేశారు. దృష్టి ఫౌండేషన్ సభ్యులు, డీపీఎస్ విద్యార్థులు శ్రమదానం చేసి చెరువు పరిసరాల్లోని వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్ళు, చెత్తాచెదారాన్ని డంపింగ్‌యార్డ్‌కు తరలించారు. ఫౌండేషన్ సభ్యురాలు చరిష్మ ఆకృతి, డైరెక్టర్లు ఎలిజబెత్ జార్జి, మిచెల్ జోష్, పూజిత కొమిరిశెట్టి, సమన్వి కొమిరిశెట్టి, సిద్దార్థ్ గుమ్మ, రిషబ్‌తోపాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో క్లీనప్ డ్రైవ్



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్‌ను మరింత క్లీన్ అండ్ గ్రీన్‌గా మార్చడమే లక్ష్యంగా ఎన్ఎస్ఎస్ పని చేస్తుందని హెచ్‌సీయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ బి కృష్ణయ్య పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లో సౌత్ గేట్ నుంచి సౌత్ క్యాంపస్ సర్కిల్ వరకు ఎన్ఎస్ఎస్ క్లీనప్ డ్రైవ్‌ను శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ భీమయ్య, శానిటేషన్, హార్టికల్చర్ అధికారులు, సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

అదుపుతప్పిన కారు..సైకిల్ ట్రాక్ ధ్వంసం



అదుపు తప్పి సైకిల్ ట్రాక్‌పైకి దూసుకెళ్లిన ఇన్నోవా కారు

గచ్చిబౌలి: ఇన్నోవా కారు అదుపు తప్పి దూసుకెళ్లడంతో హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్(హెచ్‌జీసీఎల్) సైకిల్ ట్రాక్ ధ్వంసమైన ఘటనలో రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ మహేష్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా కోయిల్కొండ మండలం, మాదిపూర్ గ్రామానికి చెందిన బోయిన ఆంజనేయులు ఇన్నోవా క్రిస్టా కారుతో శనివారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో నానక్‌రాంగూడ రోటరీ నుంచి సరీస్ రోడ్డులో నార్సింగి వైపు వెళుతున్నాడు. కొద్ది దూరం వెళ్లగానే కారు అదుపుతప్పి సైకిల్ ట్రాక్‌పైకి దూసుకెళ్లింది. 35 మీటర్లు దూసుకెళ్లడంతో స్తంభాలు, బీమ్‌లు, సోలార్ ప్యానెల్స్, రూఫ్ షీట్, ట్రాక్‌పెయింటింగ్, పెడెస్టల్స్, కర్బ్ స్టోన్ కాలమ్ లైట్లు, ఎల్‌టీ కేబుల్స్ ధ్వంసమై దాదాపు రూ.13.47 లక్షల నష్టం వాటిల్లిందని కెఎంవీ ప్రాజెక్ట్స్ సీనియర్ మేనేజర్ కిషన్ రావు పాలసాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సైకిల్ ట్రాక్‌పై, కారులో ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. కారు డ్రైవర్ ఆంజనేయులు సురక్షితంగా బయటపడ్డట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీధుల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త

- పరిసరాలు దుర్గంధమయం
- అవగాహన కల్పించినా ఫలితమేదీ..?





కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో రోడ్లపై చెత్తా చెదారం, చెత్త వేయవద్దని హెచ్చరిస్తూ జీహెచ్‌యంసీ ఫ్లెక్సీ

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ వివేకానందనగర్, ఆల్విన్‌కాలనీ, కూకట్‌పల్లి డివిజన్‌ల పరిధిలో వీధుల వెంట చెత్త పేరుకుపోవడంతో పరిసరాలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. జీహెచ్‌యంసీ సర్కిల్ పరిధిలో డస్ట్‌బిన్‌లను తొలగించి కాలనీల్లోని ఇళ్ల ముందుకు వచ్చే జీహెచ్‌యంసి వాహనంలో చెత్తను వేరు చేసి తడి, పొడి చెత్తగా అందించాలని చెప్పినా స్థానికులు ఎక్కడ పడితే అక్కడ చెత్తా చెదారం వేస్తున్నారని స్థానిక సంక్షేమ సంఘాల సభ్యులు పేర్కొంటున్నారు. జీహెచ్‌యంసీ అధికారులు ఆయా కాలనీల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. చెత్తను రోడ్డుపై వేసే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించినా ఫలితం కనిపించటం లేదు. కాగా ఇళ్ల ముందుకు వచ్చే చెత్త సేకరించే వారికి నెల నెలా 100 రూపాయలు చెల్లించటం ఎందుకనే భావనలో స్థానికులు చెత్తను ఎక్కడ పడితే అక్కడ రోడ్ల వెంట, నాలాల వెంట, నాలుగు కూడళ్ల వద్ద పడవేస్తున్నారు. కొందరు ద్విచక్ర వాహనాలపై వెళుతూ చెత్త సంచులను పడేసి వెళ్లిపోతున్నారు. చెత్త సేకరణకు డబ్బు తీసుకోకుండా ఉంటే పరిసరాలు శుభ్రంగా మారతాయని స్థానిక సంక్షేమ సంఘం సభ్యులు అభిప్రాయపడుతున్నారు. అధికారులు ఈ దిశగా ఆలోచించాలని వారు కోరుతున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

మియాపూర్ : చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తీశ్రీనగర్ కాలనీ పార్కులో దీప్తీ శ్రీనగర్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో బాడ్మింటన్ ప్రీమియర్ లీగ్- 2024 బహుమతి ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రీడలు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, మాజీ డీఎస్పీ సుంకర సత్యనారాయణ, మాదాపూర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, ప్రసాద్, రాఘవేంద్రరావు, ఓంప్రకాష్‌గౌడ్, చంద్రశేఖర్, రామారావు, కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ జగదీష్, సెక్రటరీ దుర్గారావు, జాయింట్ సెక్రటరీ చంద్రశేఖర్‌రావు, ట్రెజరర్ శ్రీరామ్, అడ్వైజర్స్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు పాల్గొన్నారు.



వైభవంగా రథోత్సవం



రాయదుర్గం: రాయదుర్గం వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి రథోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవానికి భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. రథాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు గోవిందా, గోవిందా అంటూ రథాన్ని లాగారు.